సాక్షి
రాజన్న సిరిసిల్ల
శనివారం । 3 । ఆగస్టు । 2024

ఇన్‌చార్జి కమిషనర్‌గా మీర్జా ఫసహత్ అలీ



సిరిసిల్లటౌన్: మున్సిపల్ కమిషనర్ డి.లావణ్య దీర్ఘకాలిక సెలవులో వెళ్లారు. ఆమె స్థానంలో ఇన్‌చార్జి కమిషనర్‌గా మేనేజర్‌గా పనిచేస్తున్న మీర్జా ఫసహత్ అలీబేగ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.



మిడ్‌మానేరులో 13 టీఎంసీలు

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరులో ప్రస్తుతం నీటిమట్టం 13.014 టీఎంసీలకు చేరింది. ఎల్లంపల్లి నుంచి వరదకాల్వ మీదుగా 14,494 క్యూసెక్కుల నీరు వస్తోంది.

గరిష్ఠం/కనిష్ఠం
29.0/25.0

వాతావరణం

జిల్లాలో తేలికపాటి వర్షపుజల్లులు కురుస్తాయి. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురు గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

విద్యాసంస్థల సమయానికి బస్సులు నడపాలి



సిరిసిల్లటౌన్: విద్యార్థులు స్కూళ్లు, కాలేజీలకు వెళ్లే సమయానికి బస్సులు నడపాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ కోరారు. ఈమేరకు శుక్రవారం సిరిసిల్ల డిపో మేనేజర్ ప్రకాశ్‌రావుకు వినతిపత్రం అందించి మాట్లాడారు. విద్యార్థులకు సరైన సమయంలో బస్సుల్లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. మట్టె శ్రీనివాస్, వెంకటేశ్, కరుణాకర్, శ్రీనివాస్, అరవింద్, సాయి పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో మాజీ సర్పంచులు



తంగళ్లపల్లి(సిరిసిల్ల): పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ సచివాలయం వద్ద శాంతియుత ధర్నా చేసేందుకు శుక్రవారం హైదరాబాద్ తరలిన మాజీ సర్పంచులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జిల్లా పోలీసుల కళ్లుగప్పి హైదరాబాద్‌కు చేరుకున్నా అక్కడి పోలీసులు గుర్తించి ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల అదుపులో తెలంగాణ మాజీ సర్పంచుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు యాదయ్య, జిల్లా సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు మాట్ల మధు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, తంగళ్లపల్లి మండల మాజీ అధ్యక్షుడు వలకొండ వేణుగోపాలరావు, మాజీ సర్పంచులు శివజ్యోతి, పర్శ రాములు, సరిత, లత, కమల ఉన్నారు.

డీలక్స్ మహిళా ప్రయాణికుల లక్కీ డ్రా



సిరిసిల్లటౌన్: డీలక్స్ బస్సుల్లో ప్రయాణించిన మహిళల కోసం ప్రత్యేకంగా అమలు చేస్తున్న లక్కీ డ్రాను శుక్రవారం సిరిసిల్ల డిపో మేనేజర్ ప్రకాశ్‌రావు తీశారు. పక్షం రోజులుగా ప్రయాణిస్తున్న మహిళలకు స్థానిక పాతబస్టాండులో ప్రయాణికుల సమక్షంలో డ్రా తీసి విజేతల వివరాలు వెల్లడించారు. సిరిసిల్ల–వరంగల్, సిరిసిల్ల–కరీంనగర్ నాన్‌స్టాప్ రూట్లలో మొదటి బహుమతి లక్ష్మి, ద్వితీయ ఎస్.స్వరూప, తృతీయ కె.స్వరూప ఎంపికయ్యారు. విజేతలకు విశాలషాపింగ్ మాల్ సౌజన్యంతో బహుమతులు అందజేశారు. ఆర్టీసీ సూపరింటెండెంట్ నక్క శ్రీనివాస్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, సేఫ్టీవార్డెన్ రామ్‌రెడ్డి పాల్గొన్నారు.

డెంగీపై అప్రమత్తం

సిరిసిల్లటౌన్: డెంగీ జ్వరాలు ప్రబలకుండా వైద్య, ఆరోగ్యశాఖ అప్రమత్తమైందని జిల్లా వైద్యాధికారి వసంతరావు పేర్కొన్నారు. జిల్లా కార్యాలయంలో శుక్రవారం వైద్యశాఖ సూపర్‌వైజర్లతో సమీక్షించారు. జిల్లాలో డెంగీ కేసులు నమోదుకావడంతో వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. వారంలో రెండు రోజులు డ్రైడే పాటించాలన్నారు.

హైదరాబాద్‌కు రాజన్న ఆలయ ఉద్యోగులు

వేములవాడ: రాజన్న ఆలయ ఉద్యోగుల్లో సుమారు 60కి పైగా మంది శుక్రవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ కార్యాలయానికి వెళ్లారు. రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల్లోని ఉద్యోగుల బదిలీలు ఈనెల 5కు వాయిదాపడింది. ఈలోగానే ఉద్యోగులను హైదరాబాద్‌కు పిలిపించుకుని కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారుల ద్వారా తెలిసింది. ఆలయ ఉద్యోగుల నుంచి ఆప్షన్స్ తీసుకొని పరిశీలించినట్లు తెలిసింది.

నేతన్నబీమా దరఖాస్తులు ఆహ్వానం

సిరిసిల్లటౌన్: రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి ప్రవేశపెట్టిన నేతన్నబీమాకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా చేనేత, జౌళిశాఖ ఏడీ సాగర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. చేనేత, మరమగ్గాల కార్మికులు, అనుబంధరంగాల కార్మికులు అర్హులుగా పేర్కొన్నారు. ఈనెల 8లోగా సిరిసిల్ల చేనేత, జౌళిశాఖ ఆఫీస్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పాలసీలో నమోదైన కార్మికులు మరణిస్తే ఆ కుటుంబానికి రూ.5లక్షలు బీమా వర్తిస్తుందని తెలిపారు. వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

మళ్లీ పోడులొల్లి

- పట్టాలున్నా అడ్డుకుంటున్న ఫారెస్ట్ అధికారులు
- ప్లాంటేషన్ పనులతో సాగుకు అడ్డంకి
- తిరగబడుతున్న గిరిజన రైతులు
- జిల్లా వ్యాప్తంగా 35 మందిపై కేసులు
- ఇటీవల ఓ గిరిజన రైతు ఆత్మహత్యాయత్నం
- వివాదాస్పదంగా అటవీ, రెవెన్యూ భూములు

సాక్షి ఫోకస్



బాబాయిచెరువు తండాలో పోడుభూమిలో విత్తనాలు పెడుతున్న గిరిజన మహిళా రైతు



ఈమె గిరిజన మహిళా రైతు అజ్మీరా శారద. వీర్నపల్లి మండలం బాబాయిచెరువుతండా. వీరికి ఎలాంటి సాగుభూములు లేవు. అటవీ భూమిని చదును చేసుకొని పంటలు పండిస్తున్నారు. గత ప్రభుత్వం వీరు సాగు చేసుకుంటున్న 2.07 ఎకరాలకు పట్టా ఇచ్చింది. ఆ భూమిలో పంట వేసుకోగా.. ఇటీవల అటవీశాఖ అధికారులు ఆ భూముల్లో ప్లాంటేషన్ పనులు చేపట్టారు. అడ్డగించిన శారద భర్త రాజుపై కేసు నమోదు చేశారు. దీంతో రాజు పురుగుల మందు తాగగా.. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.



ఇతను వీర్నపల్లి మండలం బాబాయిచెరువు తండాకు చెందిన భూక్య భరత్. గత ప్రభుత్వం అటవీ భూములు సాగుచేసుకుంటున్న అర్హులైన గిరిజన రైతులకు పట్టాలిచ్చింది. తనకు ఇచ్చిన భూమిలో భరత్ సాగుచేసుకుంటుండగా ఇటీవల అటవీ అధికారులు ప్లాంటేషన్ పనులు చేసేందుకు యత్నించగా అడ్డుకున్నారు. ఈ సంఘటనతో ఎలాంటి సంబంధం లేని భరత్‌పై అటవీ అధికారులు కేసు నమోదు చేసి, ట్రాక్టర్‌ను సీజ్ చేశారు.

భూముల వివరాలు (ఎకరాలలో..)

అటవీశాఖ	47,515
రెవెన్యూశాఖ	1,33,190
పంపిణీ చేసిన భూములు(అటవీ)	1,023
రెవెన్యూశాఖ పంపిణీ భూములు	40,420
సాగుభూములు	18,131
లబ్ధిదారులు	18,304

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): జిల్లాలో పోడుభూముల లొల్లి మళ్లీ మొదలైంది. అటవీనే నమ్ముకొని బతుకుతున్న గిరిజనులు తమ సమీప ఫారెస్ట్ భూముల్లో పంటలు సాగుచేసుకోకుండా అటవీ అధికారులు అడ్డుకుంటున్నారు. అయితే ఆ భూములకు గత ప్రభుత్వం పట్టాలు ఇచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదు. అడ్డుగా వెళ్తున్న గిరిజనులపై కేసులు నమోదు చేస్తున్నారు. ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములకు గత ప్రభుత్వం పట్టాలిచ్చినా.. ఫారెస్ట్ అధికారులు మొక్కలు నాటడంపై నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. గత వారం రోజులుగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఘర్షణలు జరిగాయి.

35 మందిపై కేసులు

రాజన్నసిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం బాబాయి చెరువుతండా, రాశిగుట్టతండా, ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగుండారం గ్రామాల్లో ప్లాంటేషన్ పనులను అడ్డుకుంటున్న గిరిజన రైతులపై కేసులు నమోదు చేస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 35 మందిపై కేసులు నమోదు చేశారు. బాబాయిచెరువు తండాకు చెందిన పోడు రైతు అజ్మీరా రాజు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం కలకలం రేపింది.

జిల్లాలో 2.20 లక్షల ఎకరాలు

జిల్లాలో రెవెన్యూ, అటవీశాఖకు సంబంధించి 2.20 లక్షల ఎకరాల భూములు ఉన్నాయి. ఇందులో ఇప్పటి వరకు 41,443 ఎకరాలను ప్రభుత్వం సాగుదారులకు హక్కుపత్రాలను కల్పించింది. కాగా మరో 18,131 ఎకరాలను గిరిజనులు, గిరిజనేతరులు సాగుచేసుకుంటున్నారు. 30 ఏళ్లగా అటవీ, రెవెన్యూ భూములను సాగుచేసుకుంటున్న వారికి ప్లాంటేషన్ పనులతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.



భూమి చదును చేస్తున్న గిరిజన రైతు కుటుంబం

రెండుశాఖల మధ్య సమన్వయలోపం

ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, తంగళ్లపల్లి, కోనరావుపేట, చందుర్తి, రుద్రంగి మండలాల్లో రెవెన్యూ, అటవీశాఖ ఆధీనంలో ఉన్న భూములకు హద్దులు నిర్ణయించడంలో అధికారులు విఫలమవుతున్నారు. ఫలితంగా గుంటెడు భూమిలేని పేదలు హక్కుపత్రాలను పొందలేకపోతున్నారు. దీంతో 30 ఏళ్లగా భూములను చదును చేసుకుని పంటలు సాగుచేసుకుంటున్న వారిలో ఆందోళన నెలకొంది.

హక్కుపత్రాలున్నా కేసులే..



గత ప్రభుత్వం పోడు భూములను సాగుచేసుకుంటున్న గిరిజన రైతులకు హక్కుపత్రాలు ఇచ్చింది. పట్టాలు పొందిన భూముల్లో పంటలు సాగుచేస్తే అటవీ అధికారులు పంటలను ధ్వంసం చేస్తూ ప్లాంటేషన్ చేస్తున్నారు. అడ్డుకుంటున్న రైతులపై కేసులు నమోదు చేస్తున్నారు. రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలి. అగ్రవర్ణాల పేదరైతులకు సైతం పోడుపట్టాలు ఇవ్వాలి.

– మల్లారపు అరుణ్‌కుమార్, ప్రజాసంఘాల జిల్లా నాయకుడు





భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన

సిరిసిల్లకల్చరల్: అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అనుబంధ ఆలయాలు శ్రీలలితా త్రిపుర సుందరి, శ్రీఅష్టలక్ష్మీ లక్ష్మీనారాయణ ఆలయాల మూడో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ సామూహిక కుంకుమార్చనలు చేశారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు రాచ విద్యాసాగర్‌గురుస్వామి, ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

వస్త్రపరిశ్రమ సమస్యలు పరిష్కరిస్తాం

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్లటౌన్: వస్త్ర పరిశ్రమ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో యజమానులు, ఆసాములతో శుక్రవారం సమావేశమయ్యారు. పరిశ్రమకు కరెంటు సబ్సిడీ కొనసాగించాలని యజమానులు, ఆసాములు విన్నవించగా, ఆయన సెస్ చైర్మన్ చిక్కాల రామారావుతో ఫోన్‌లో మాట్లాడారు. హైకోర్టు కేసు, ఈఆర్‌సీ ఆదేశాల మేరకు 10హెచ్‌పీల వరకు సబ్సిడీ ఇస్తున్నట్లు వెల్లడించారు. టెక్స్‌టైల్ ఏడీ సాగర్, ఎండీ రవీందర్‌రెడ్డి, డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పాడిపశువుల యూనిట్లు పూర్తిచేయాలి

పాడిపశువుల యూనిట్ల గ్రౌండింగ్‌కు చర్యలు తీసుకోవాలని జిల్లా బ్యాంకర్లను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. రుణమాఫీ పూర్తి చేసి సంబంధిత రైతుల రెన్యూవల్స్ పూర్తి చేయాలన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా పాడిపశువుల యూనిట్ల గ్రౌండింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం ఇప్పటి వరకు రెండు విడతల్లో రూ.లక్షన్నర వరకు రుణాలు మాఫీ చేసిందని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 35,676 మంది రైతులకు రూ.244.82లక్షల కోట్లు రుణమాఫీ జరిగిందన్నారు. రైతుల నుంచి ఫిర్యాదుల స్వీకరణకు ప్రతి మండలంలో గ్రీవెన్‌సెల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. లీడ్‌బ్యాంకు మేనేజర్ మల్లికార్జున్, జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్, జెడ్పీ సీఈవో గీత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

రోడ్డెక్కిన కార్మికులు



చేనేతన్న విగ్రహం వద్ద నేతకార్మికుల నిరసన

సిరిసిల్లటౌన్: సాంచాలు నడవాలి..నేతకార్మికులు బతకాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు జువ్వాజి విమల కోరారు. ఎనిమిది నెలలుగా సాంచాలు బందైనా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ శుక్రవారం బీవైనగర్‌లో జెండా చౌరస్తాలో మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. కార్మికులు పనుల్లేకుండా బలవన్మరణాలకు పాల్పడుతుంటే స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్, కేంద్ర మంత్రి బండి సంజయ్‌లు పట్టించుకోకపోవడంపై ప్రశ్నించారు. సూరం పద్మ పాల్గొన్నారు. సీఎం వ్యాఖ్యలను నిరసిస్తూ నేతన్న విగ్రహం వద్ద నిరసన తెలిపారు.

12వ రోజుకు దీక్ష

వస్త్రపరిశ్రమ, అనుబంధ రంగాల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దీక్ష పన్నెండో రోజుకు చేరింది. కుమ్మరికుంట కిషన్, ఎలిగేటి శ్రీనివాస్, మ్యానరాజు, మిట్టపల్లి ప్రసాద్, ఐలాల శంకర్, బచ్చు సదానందం, ధీకొండ చందు, లింగేశ్ పాల్గొన్నారు.

37 మంది బాలకార్మికులకు విముక్తి

- తల్లిదండ్రులకు కౌన్సెలింగ్
- ఎస్పీ అఖిల్ మహాజన్



ఎస్పీ అఖిల్‌మహాజన్

సిరిసిల్లక్రైం: ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా జిల్లాలో 37 మంది బాలకార్మికులకు విముక్తి కల్పించినట్లు ఎస్పీ అఖిల్‌మహాజన్ శుక్రవారం తెలిపారు. గత నెల 1 నుంచి 31 వరకు నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్‌లో 37 మంది బాలకార్మికులను పట్టుకొని వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. ఇద్దరు పిల్లలను బడిలో చేర్పించినట్లు వివరించారు. 18 ఏళ్లలోపు పిల్లలను పనిలో పెట్టుకున్న వారిపై 14 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వీధిబాలలు కనిపిస్తే డయల్ 100, స్థానిక పోలీసులు సమాచారం ఇవ్వాలని కోరారు.

స్వచ్ఛదనం–పచ్చదనంలో భాగస్వాములు కావాలి

- జెడ్పీ సీఈవో ఉమారాణి

బోయినపల్లి(చొప్పదండి): స్వచ్ఛదనం–పచ్చదనంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని జెడ్పీ సీఈవో ఉమారాణి కోరారు. ఈమేరకు శుక్రవారం స్థానిక మండల పరిషత్‌లో మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు కోసం ఈనెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు స్వచ్ఛదనం–పచ్చదనం ఏర్పాటు చేసిందని తెలిపారు. ఎజెండా ప్రకారం ప్రతీ గ్రామంలో వార్డులవారీగా కార్యక్రమాన్ని చేపట్టాలని కోరారు. అనంతరం కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఎంపీడీవో బీమా జయశీల తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో ఉమారాణి

'జూకంటి'కి నాగుల మల్లయ్య పురస్కారం

సిరిసిల్లటౌన్: రంగస్థల నటుడు నాగుల మల్లయ్య స్మారకార్థం ఇచ్చే ప్రతిభ పురస్కారాలను ఈనెల 4న ప్రదానం చేయనున్నట్లు పురస్కార కమిటీ సమన్వయకర్తలు ఎండీ సలీం, నాగుల సంతోష్‌గౌడ్ తెలిపారు. సిరిసిల్లలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. కళాకారులను ప్రోత్సహించేందుకు 37 ఏళ్లుగా పురస్కారాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈఏడాదికి సిరిసిల్లకు చెందిన తెలంగాణ జాతీయ రచయితల సంఘం కన్వీనర్, దాశరథి పురస్కార గ్రహీత జూకంటి జగన్నాథంకు పురస్కారం అందిస్తున్నట్లు ప్రకటించారు.

సీజనల్ వ్యాధులను నియంత్రించాలి

- వైద్య, ఆరోగ్యశాఖ సెక్రెటరీ క్రిస్టియానా జెడ్ చాంగ్

సిరిసిల్లటౌన్: సీజనల్ వ్యాధుల నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని వైద్య, ఆరోగ్య శాఖ సెక్రటరీ క్రిస్టియానా జెడ్ చాంగ్ సూచించారు. సీజనల్ వ్యాధులు, వాటి నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై శుక్రవారం అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్, డీఎంహెచ్‌వో వసంతరావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజగోపాల్, వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేశ్ పాల్గొన్నారు.

విపత్తు సేవకుల దరఖాస్తులు ఆహ్వానం

విపత్తు నిర్వహణలో సేవలందించిన వ్యక్తులు, సంస్థలు, జాతీయ విపత్తు పురస్కారానికి దరఖాస్తు చేసుకోవాలని అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ ప్రకటించారు. ×సుభాష్ చంద్రబోస్¤ ఆపద ప్రబంధన్ పురస్కారానికి అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అవార్డుల కోసం https://awards.gov.in ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఈనెల 31లోపు పంపించాలని సూచించారు.



వీసీకి హాజరైన ఖీమ్యానాయక్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు



వైభవంగా మహాలింగార్చన

వేములవాడ: రాజన్న సన్నిధిలో మాసశివరాత్రిని పురస్కరించుకుని మహామంటపంలో శుక్రవారం మహాలింగార్చన నిర్వహించారు. ఉదయం స్వామివారికి ఆలయ అర్చకులు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతార్చనలు నిర్వహించారు.

తెగిన గంజివాగు కల్వర్టు



బోయినపల్లి(చొప్పదండి): బోయినపల్లి మండల కేంద్రం నుంచి వేములవాడకు వెళ్లే మార్గంలో మండలంలోని స్తంభంపల్లి గంజివాగుపై ఏర్పాటు చేసిన తాత్కాలిక కల్వర్టు చిన్నపాటి వరదకే తెగిపోయింది. గంజివాగుపై వంతెన పనులు కొనసాగుతుండడంతో తాత్కాలికంగా పైపులతో కల్వర్టు ఏర్పాటు చేశారు. గురువారం కురిసిన చిన్నపాటి వర్షానికే ఇలా తెగిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

బకాయిల భారం

- పేరుకుపోయిన ప్రభుత్వ కార్యాలయాల కరెంట్ బిల్లులు
- నోటీసులు జారీచేసినా చెల్లించని వైనం
- రూ.3.46కోట్లు పెండింగ్
- ఇప్పటికే సబ్‌రిజిస్ట్రార్ ఆఫీస్‌కు కరెంట్ కట్

విద్యుత్ బకాయిలు ఇలా..

కార్యాలయాలు	బకాయిలు
వేములవాడ మున్సిపల్	రూ.3.24కోట్లు
వేములవాడ ఏరియా ఆస్పత్రి	రూ.13.19లక్షలు
ప్రాథమిక ఆరోగ్య కేంద్రం	రూ.3లక్షలు
అర్బన్, రూరల్ మండల పరిషత్‌లు	రూ.52వేలు
సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్	రూ.2.53 లక్షలు
వేములవాడరూరల్ తహసీల్దార్	రూ.3.55లక్షలు



వేములవాడ మున్సిపల్ కార్యాలయం

వేములవాడఅర్బన్: ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ బకాయిలు పేరుకుపోయాయి. ఏళ్లకొద్ది బిల్లులు చెల్లించకపోవడంతో కొన్ని శాఖల కార్యాలయాలు కోట్ల రూపాయలు బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఇటీవల వేములవాడ సబ్‌రిజిస్ట్రార్ ఆఫీస్ కరెంట్ సరఫరా నిలిపివేసినా బిల్లులు చెల్లించడం లేదు. ఫలితంగా ఒక్క రోజు మొత్తం సబ్‌రిజిస్ట్రార్ ఆఫీస్‌లో సేవలు నిలిచిపోయాయి. ఒక్క వేములవాడ నియోజకవర్గంలోని ప్రభుత్వ కార్యాలయాల బిల్లులే రూ.3.46కోట్ల వరకు పెండింగ్ పడ్డాయి.

నోటీసులు జారీ

వేములవాడలోని సెస్‌కు బిల్లులు బకాయిపడ్డ వేములవాడ మున్సిపల్ కార్యాలయానికి గతంలోనే నోటీస్‌లు జారీ చేయడంతోపాటు ఒకసారి కరెంట్ కనెక్షన్ తొలగించారు. బకాయిలు చెల్లిస్తామన్న అధికారుల హామీతో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. వేములవాడ ఏరియా ఆస్పత్రికి, పీహెచ్‌సీకి, వేములవాడ అర్బన్, వేములవాడ రూరల్ మండల పరిషత్‌లు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు నోటీసులు అందించారు. అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో గత మంగళవారం వేములవాడ సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌కు కరెంట్ కట్ చేశారు. బుధవారం ఇన్వర్టర్‌తో నడిపించగా.. గురువారం మధ్యాహ్నం త్వరలోనే బకాయిలు చెల్లిస్తామని చెప్పడంతో విద్యుత్ సరఫరా అందించారు

నోటీస్‌లు అందించాం



వేములవాడ పట్టణంలో విద్యుత్ బకాయిలు ఉన్న ప్రభుత్వ కార్యాలయాలకు నోటీసులు అందించాం. ఇటీవల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి కరెంట్ సరఫరా నిలిపివేశాం. ఇప్పటికైనా సెస్‌కు పడ్డ బకాయిలు త్వరగా చెల్లించాలి.

– సిద్ధార్థ, సెస్, వేములవాడ టౌన్ ఏఈ

క్లుప్తంగా

గంజాయి పట్టివేత



మేడిపల్లి(వేములవాడ): మేడిపల్లి మండలం కొండాపూర్‌లో గంజాయి విక్రేతను పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు వివరాలు వెల్లడించారు. నిజమాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన మ్యాకల శ్రీకర్ సులువుగా డబ్బు సంపాదించేందుకు గంజాయి విక్రయాలకు అలవాటుపడ్డాడు. గురువారం సాయంత్రం మేడిపల్లి మండలం కొండాపూర్‌లో తన బంధువులు, యువకులకు విక్రయించేందుకు 565 గ్రాముల గంజాయి తీసుకురాగా పక్కా సమాచారంతో ఎస్సై శ్యాంరాజు పట్టుకుని నిందితుడి నుంచి గంజాయి, బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఈసందర్భంగా ఎస్సై శ్యాంరాజ్, సిబ్బంది చంద్రశేఖర్, దినేశ్, అనిల్ తదితరులను ఎస్పీ అభినందిచారు.

పిచ్చికుక్క దాడిలో గాయపడిన చిన్నారి



కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల మండలం కొండాపూర్‌లో శుక్రవారం పిచ్చికుక్క దాడిలో చిన్నారికి తీవ్రగాయాలయ్యాయి. చైత్ర(4) సాయంత్రం ఇంటి బయట ఆడుకుంటుండగా పిచ్చికుక్క దాడి చేయడంతో మెడ, చేతిపై గాయాలయ్యాయి. వెంటనే కొడిమ్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు యత్నించగా, అక్కడా ఎవరూ లేరని తెలియడంతో ఓ ఆర్‌ఎంపీ వద్ద ప్రథమ చికిత్స చేయించారు. కాగా పిచ్చికుక్క దాడిలో గ్రామంలోని మరో పెంపుడు కుక్క సైతం గాయపడినట్లు స్థానికులు తెలిపారు.

చిన్నారి వైద్యానికి రూ.10 లక్షలు

- అండగా నిలిచిన రాజన్నసిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ
- మెరుగైన వైద్య చికిత్స అందించేందుకు చర్యలు
- చిన్నారి తల్లి, మండల తహసీల్దార్ పేరిట జాయింట్ ఖాతా
- 'సాక్షి' కథనానికి స్పందన





ముక్కు ద్వారా ఆహారం అందిస్తున్న తల్లి శ్యామల, మెడికల్ రిపోర్టులు పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ

వీర్నపల్లి(సిరిసిల్ల): కేన్సర్‌తో బాధపడుతున్న చిన్నారి నయనశ్రీ వైద్యానికి ఆర్థిక సహాయం అందించేందుకు రాజన్నసిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ ముందుకొచ్చారు. చిన్నారిని శుక్రవారం పరామర్శించి, ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. నయనశ్రీ కేన్సర్‌తో బాధపడుతోందని, వైద్యానికి డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నారని 'నా బిడ్డకు అయుష్షు పోయండి' శీర్షికన గత నెల 31 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ స్పందించారు. చిన్నారి మెరుగైన వైద్యానికి అవసరమైన డబ్బులను అందించేందుకు ఏర్పాటు చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం గర్జనపల్లికి చెందిన గజ్జెల దిలీప్–శ్యామల దంపతుల చిన్నకూతురు నయనశ్రీ కేన్సర్‌తో బాధపడుతోంది. చికిత్స కోసం డబ్బులు లేవంటూ దాతలు సహాయం కోరగా.. చిన్నారి చికిత్సకు సంపూర్ణ మద్దతు అందించేందుకు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ ముందుకొచ్చారు. వీర్నపల్లి మండలం గర్జనపల్లిలోని చిన్నారి ఇంటిని శుక్రవారం కలెక్టర్ సందర్శించారు. చిన్నారికి వైద్యం అందించేందుకు ఇప్పటికే తల్లిదండ్రులు రూ.3 లక్షలు అప్పుచేశారని తెలుసుకున్నారు. నయనశ్రీకి చికిత్స అందించేందుకు ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుందన్నారు. వీర్నపల్లి తహసీల్దార్, చిన్నారి తల్లి పేరిట జాయింట్ బ్యాంకు ఖాతా ప్రారంభించి, వెంటనే వైద్యఖర్చుల నిమిత్తం రూ.10లక్షలు జమచేశారు. చిన్నారికి మెరుగైన వైద్యం ఎక్కడ అందించాలన్న అంశంపై నివేదిక ఇవ్వాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారికి సూచించారు. డీఎంహెచ్‌వో రిపోర్ట్ ప్రకారం చికిత్స ప్రారంభించాలని, ఖాతాలో జమచేసిన నిధులు చికిత్స కోసం వినియోగించాలని సూచించారు. అవసరమైతే మరిన్ని నిధులు కూడా అందించడానికి సిద్ధంగా ఉన్నామని, తల్లిదండ్రులు ఆందోళన చెందొద్దని భరోసానిచ్చారు. చికిత్స విషయమై ఏ సమయంలోనైనా నేరుగా తనకు ఫోన్‌చేయాలని కలెక్టర్ తెలిపారు. డీఎంహెచ్‌వో వసంతరావు, ఇన్‌చార్జి తహసీల్దార్ మారుతిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్, ఆర్‌ఐ ప్రవీణ్, మెడికల్ సిబ్బంది చిరంజీవి, మంజుల, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

అంజనశ్రీకి అండగా 'తేజశ్రీ'



అంజనశ్రీని ఆదుకోండి

'సాక్షి'లో ప్రచురితమైన కథనం



కృత్రిమ కాలు అందజేస్తున్న ట్రస్ట్ వ్యవస్థాపకులు పైడిరాజు

- రూ.2.10 లక్షలతో కృత్రిమ కాలు

రాయికల్(జగిత్యాల): రాయికల్ పట్టణంలోని కూచిపూడి కళాకారిణి దివ్యాంగురాలైన అంజనశ్రీకి రాజమండ్రికి చెందిన తేజశ్రీ చారిటబుల్ ట్రస్ట్ అండగా నిలిచింది. ట్రస్ట్ వ్యవస్థాపకుడు కొలిమెల్ల పైడిరాజు స్పందించి రూ.2.10 లక్షల విలువైన కృత్రిమ కాలును బయోనిక్ సంస్థ ద్వారా చేయించి శుక్రవారం అంజనశ్రీకి అందజేశారు. మే 15న 'సాక్షి'లో 'అంజనశ్రీని ఆదుకోండి' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో ట్రస్ట్ సభ్యులు శ్రీమతి దర్శిని, వెంకటనరేశ్, రామారావు, విష్ణుల సహకారంతో అంజనశ్రీకి కృత్రిమ కాలు అందించారు. భవిష్యత్‌లో నాట్యమయూరిగా పేరు ప్రఖ్యాతలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అరికపూడి సేవ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రఘు, దయ్యాల మహేశ్, లావణ్య, రసజ్ఞ పాల్గొన్నారు.

భార్య అవయవదానంతో భర్తకు అరుదైన గౌరవం



నర్సయ్యను సన్మానిస్తున్న అధికారులు

సారంగాపూర్(జగిత్యాల): చనిపోయిన భార్య అవయవాలు దానం చేయడంతో భర్తకు అరుదైన గౌరవం దక్కింది. వివరాలు.. బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామానికి చెందిన పానగంటి నర్సయ్య భార్య పద్మ గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేసేది. గతేడాది తన ఇంట్లో బాత్‌రూంలో కింద పడి స్పృహ కోల్పోయింది. చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించగా ఫిబ్రవరి 28, 2023లో మృతిచెందింది. ఈ క్రమంలో నర్సయ్య పిల్లలతో చర్చించి పద్మ అవయవాలను హైదరాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో దానం చేశారు. ఈనేపథ్యంలో 14వ జాతీయ అవయవదానం (నేషనల్ ఆర్గాన్ డొనేషన్ డే) దినోత్సవంలో భాగంగా శుక్రవారం హైదరాబాద్ గాంధీ మెడికల్ కళాశాల ఆడిటోరియంలో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన జీవన్‌దాన్ కార్యక్రమంలో నర్సయ్యను సన్మానించారు. కార్యక్రమానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఆర్థిక ఇబ్బందులతో గొర్రెల కాపరి బలవన్మరణం



రామడుగు: దేశరాజ్‌పల్లి గ్రామానికి చెందిన గొర్రెల కాపరి అమరగొండ రాజయ్య(53) ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. రాజయ్య గొర్రెలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం దేశరాజ్‌పల్లి ఎక్స్ రోడ్డు సమీపంలో పురుగుల మందు తాగి పడిపోయాడు. గమనించిన దారివెంట వెళ్లేవారు కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. ఆటోలో కరీంనగర్ ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందాడు. భార్య కనకమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేందర్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

- నారాయణపూర్‌లో విషాదం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని నారాయణపూర్‌కు చెందిన లింగాల సురేష్‌గౌడ్(26) అనే యువకుడు శుక్రవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. సంఘటన స్థలాన్ని ఎస్సై రమాకాంత్ పరిశీలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మూడు రోజుల క్రితం మహారాష్ట్ర నుంచి వచ్చిన సురేష్‌గౌడ్ ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని రాచర్లగొల్లపల్లికి వెళ్లే రహదారిలో గల మహేంద్ర షోరూం వద్ద అనుమానాస్పద పరిస్థితుల్లో మృతిచెంది పడి ఉన్నాడు. మహారాష్ట్రలో కూలీ పనులు చేసుకొని కుటుంబాన్ని పోషించుకుంటున్న సురేష్‌గౌడ్ కొంతకాలంగా మధుమేహం వ్యాధితో బాధపడుతున్నట్లు తెలిసింది. ఈక్రమంలోనే అతని మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టినట్లు, గుండెపోటుతో మరణించినట్లు లేదా ఎవరైనా కొట్టి చంపారా.. అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం సిరిసిల్ల ఏరియాస్పత్రికి తరలించారు. సురేష్‌గౌడ్ మృతితో తల్లితండ్రులు బాల్‌రాజు, ఎల్లవ్వ, భార్య శ్రావణి, కుమారుడు అన్విత్, కుతూరు రితన్య రోదిస్తున్న పద్దారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు.



సురేష్‌గౌడ్ (ఫైల్)

కడుపునొప్పి భరించలేక వివాహిత ఆత్మహత్య

- ఎలుకల మందు తాగి మృతి
- గల్ఫ్‌లో ఉన్న భర్త రాక కోసం శవ జాగరణ



స్రవంతి(ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని నారాయణపూర్‌కు చెందిన వివాహిత సకినాల స్రవంతి(36) కడుపునొప్పి భరించలేక ఎలుకల మందు తాగి శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడింది. భర్త గల్ఫ్‌లో ఉండగా, అతని చివరిచూపు కోసం మృతదేహాన్ని ఫ్రీజర్‌లో ఉంచి కుటుంబ సభ్యులు, బంధువులు శవజాగరణ చేస్తున్నారు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాలు. ముస్తాబాద్ మండలం గూడెంకు చెందిన స్రవంతికి నారాయణపూర్‌కు చెందిన దేవరాజుతో పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం కన్నయ్య, మిన్ను. స్రవంతి కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. పలు ఆస్పత్రులు తిరిగినా నొప్పి తగ్గలేదు. చివరికి తీవ్రమైన నొప్పితో భరించలేక ఎలుకలమందు తాగింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందింది. కాగా కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మృతురాలి భర్త దేవరాజు ఉపాధి కోసం గల్ఫ్ దేశంలో ఉంటున్నాడు. తండ్రి బొప్ప శంకరయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు.

అగ్నిప్రమాదంలో సామగ్రి దగ్ధం



కాలిపోయిన ఫ్రిజ్

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ ఎక్స్ సర్వీస్‌మెన్ కాలనీలో శుక్రవారం మెండే రజిత ఇంట్లో అగ్ని ప్రమాదం సంభవించింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూలేరు. కరెంట్ షార్ట్‌సర్క్యూట్‌తో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో సుమారు రూ.1.50లక్షల విలువైన గృహోపకరణాలు మంటల్లో కాలిబూడిదయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సై సతీశ్ కేసు నమోదు చేసుకొన్నారు.

తాళం వేసిన ఇళ్లే లక్ష్యం

- గంభీరావుపేటలో ఓ ఇంట్లో దొంగతనం



గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేటలో తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా దొంగతనాలకు పాల్పడుతున్నారు. వరుస దొంగతనాలతో మండల కేంద్ర ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. తాజాగా గురువారం మండల కేంద్రానికి చెందిన దుద్దెడ విజయ ఇంట్లో దొంగలు పడ్డారు. విజయ అత్తమ్మ అనారోగ్యంతో రెండు నెలల క్రితం చనిపోవడంతో ఇంటికి తాళం వేసే అద్దె ఇంట్లో ఉంటోంది. శుక్రవారం తెల్లవారుజామున ఇంటికి వెళ్లి చూడగా తాళాలు పగులగొట్టి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో దాచిన ఐదు గ్రాముల బంగారం, 9 గ్రాముల చెవికమ్మలు, మూడు గ్రాముల మాటీలు, ముక్కుపుడక, ఉంగరం, 10 తులాల వెండిని దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్, గంభీరావుపేట ఎస్సై రామ్మోహన్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళను కిడ్నాప్ చేసిన ఐదుగురి అరెస్ట్

వీణవంక: మహిళను కిడ్నాప్‌చేసిన ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. చల్లూరు గ్రామానికి చెందిన శివరాత్రి అక్షయ అదేగ్రామానికి చెందిన కొంచెం సంతోష్ ఐదేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. గతనెల 22న వివాహం చేసుకున్నారు. కూతురు ప్రేమ పెళ్లి ఇష్టంలేని తల్లి శివరాత్రి గంగాజమున, బాబాయ్ శివరాత్రి శంకర్, పల్లెపు రాజు, పల్లెపు రజిత, శివరాత్రి రాజలింగం శుక్రవారం ఉదయం సంతోష్ ఇంటికి వెళ్లి నోటికొచ్చినట్లు మాట్లాడి ఇంటి తలుపులు పగులగొట్టి అక్షయను కిడ్నాప్ చేశారు. అడ్డుకునే ప్రయత్నం చేసిన సంతోష్ తల్లిపై దాడిచేశారు. చంపుతామని బెదిరించారు. ఘటనపై అక్షయ భర్త సంతోష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ అనంతరం నిందితులను అరెస్టు చేసి హుజూరాబాద్‌లో కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్సై వివరించారు. కిడ్నాప్‌నకు గురైన అక్షయను తిరిగి సంతోష్‌ కు అప్పగించినట్లు తెలిపారు.

పరామర్శ కరువాయే...

- సంచలనంగా వృద్ధురాలిని కుక్కలు పీక్కుతిన్న ఘటన
- స్పందించని నాయకులు, అధికారులు
- గ్రామస్తుల నుంచి విమర్శలు

ముస్తాబాద్(సిరిసిల్ల): నిద్రిస్తున్న వృద్ధురాలిపై వీధికుక్కలు దాడిచేసి పీక్కుతిన్న ఘటనపై అధికారులు, నాయకులలో మానవత్వం కరువైంది. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన వీధికుక్కల దాడి ఘటనపై మానవత్వం మాయమైంది. ముస్తాబాద్ మండలం సేవాలాల్‌తండా పరిధిలోని బట్టోనితాళ్లలో పిట్ల రామలక్ష్మి అనే వృద్ధురాలిని వీధికుక్కలు బుధవారం అర్ధరాత్రి దాడి చేసి చంపివేసిన సంగతి తెలిసిందే. రామలక్ష్మి తలభాగం, కడుపు, చేయి, కాళ్ల భాగాలను పీక్కుతిన్న సంఘటనతో జిల్లా ఉలిక్కిపడింది. బాధ్యులైన పంచాయతీ అధికారులు, రెవెన్యూ అధికారులు కనీసం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఓదార్చే ప్రయత్నం చేయలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓ నిండు ప్రాణం వీధికుక్కల దాడికి బలికాగా కనీసం సంఘటన ఎలా జరిగిందో విచారణ చేసే తీరిక పంచాయతీ అధికారుల్లో కొరవడిందనే విమర్శలు వస్తున్నాయి. సంఘటన జరిగిన రోజున కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు గజ్జెల రాజు మినహా ఏ ఇతర నాయకులు బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పే ప్రయత్నం చేయకపోవడం విచారకరం. ప్రభుత్వం తరపున ఏ ఒక్క అధికారి సంఘటన వివరాలను క్షేత్రస్థాయిలో తెలుసుకోలేకపోయారంటే మానవత్వం ఎక్కడుందని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

థమ్సప్ అనుకుని గడ్డిమందు తాగి..

- చికిత్స పొందుతూ యువరైతు మృతి



ప్రభాకర్(ఫైల్)

గొల్లపల్లి(ధర్మపురి): దమ్మన్నపేట గ్రామానికి చెందిన యువరైతు బొలిశెట్టి ప్రభాకర్ (35) థమ్సప్ అనుకుని పొరపాటునా గడ్డిమందు తాగగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. ప్రభాకర్‌ది వ్యవసాయ కుటుంబం. గత నెల 22న తనకు చేబదులుగా వచ్చినవారికి పనికి వెళ్లాడు. అక్కడ ఓ కూలీ పొలంలో జంబుకొట్టడానికి వచ్చాడు. అతను గడ్డిమందును మరో వ్యక్తి వద్ద చేబదలు తీసుకుని థమ్సప్ సీసాలో పోసి ఒడ్డున పెట్టాడు. ఈక్రమంలో మధ్యాహ్నం అలసిపోయి ఒడ్డుకు చేరుకున్న ప్రభాకర్ గడ్డిమందును థమ్సప్ అనుకుని తాగే క్రమంలో థమ్సప్ కాదని తెలియడంతో ఉమ్మివేశాడు. అప్పటికే గుక్కెడు కడుపులోకి పోవడంతో అదేరోజు జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కరీంనగర్, అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. కాగా అతడి భార్య శిరీష భర్తను కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడింది. చికిత్స నిమిత్తం రూ.18 లక్షల వరకు అప్పు చేసి ఖర్చుచేసింది. అయినా ప్రభాకర్ మృతితో ఆ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. మృతుడికి కొడుకు లింగేశ్వర్, కూతురు వైష్ణవి ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వృద్ధురాలిపై దాడిచేసిన వ్యక్తి అరెస్ట్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్లబొప్పాపూర్‌కు చెందిన రాకం నర్సవ్వ(62)పై దారి విషయంలో దాడిచేసిన అదే గ్రామానికి చెందిన బత్తుల రాజును శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. ఇంటి స్థలం దారి విషయంలో వృద్ధురాలికి నిందితునికి మధ్య కొంతకాలంగా వివాదం ఉంది. ఈ విషయంలో గత నెల 26న నర్సవ్వతో రాజు ఘర్షణపడి కర్రలతో దాడిచేశాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి రాజును రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.

కట్నం వేధింపుల కేసు నమోదు

జమ్మికుంట: అదనపు కట్నం కోసం వేధించిన ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ వరంగంటి రవి శుక్రవారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. జమ్మికుంటకు చెందిన రమ్యకు హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఇందిరానగర్ కాలనీకి చెందిన కొల్లోజు శ్రీనివాసచారితో 2010లో వివాహమైంది. ఆ సమయంలో కట్నకానుకలు, ఇతర లాంఛనాలు అప్పగించారు. వీరికి కుమారుడు జన్మించాడు. తరువాత భర్త కొల్లోజు శ్రీనివాస్‌చారి, అత్తమామలు ఆంద్రయ్య, సుశీల, బావ, తోటికోడలు సత్యనారాయణ మమత, మరిది, తోటికోడలు దేవేందర్, నిత్య కలిసి రూ.5లక్షల అదనపు కట్నం తేవాలని వేధిస్తున్నారు. ఈ విషయమై 2017 నుంచి 2023 వరకు పలుమార్లు పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ జరిగింది. అయినా వేధింపులు ఆగకపోవడంతో రమ్య జమ్మికుంట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

రేపు కరీంనగర్‌లో జిల్లాస్థాయి ఈతపోటీలు

గోదావరిఖనిటౌన్: తొమ్మిదో తెలంగాణ జిల్లాస్థాయి ఈతపోటీలు ఈనెల 4న కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు స్విమ్మింగ్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి టి.కృష్ణమూర్తి శుక్రవారం తెలిపారు. వాటర్‌పోలో విభాగంలో మహిళలు, పురుషులకు వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తారన్నారు. ప్రతిభ కనబర్చిన స్విమ్మర్లు ఈనెల 18న సికింద్రాబాద్‌లోని జీహెచ్‌ఎంసీలో నిర్వహించే రాష్ట్రస్థాయి ఈతపోటీలకు అర్హత సాధిస్తారని ఆయన పేర్కొన్నారు.

అత్యాచారయత్నం చేసిన యువకుడి అరెస్టు

కరీంనగర్‌క్రైం: యువతిపై అత్యాచారయత్నానికి పాల్పడ్డ యువకుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కరీంనగర్ వన్‌టౌన్ సీఐ సరిలాల్ తెలిపిన వివరాలు. రాజన్నసిరిసిల్ల జిల్లా చందుర్తి మండలానికి చెందిన చింతం వంశీకృష్ణ (21) కరీంనగర్ జిల్లా కేంద్రంలోని భగత్‌నగర్‌లో ఒక అద్దె ఇంట్లో ఉంటూ డిగ్రీ చదువుతున్నాడు. మంచిర్యాల చెందిన యువతితో ఏడాది క్రితం పరిచయం ఏర్పడడంతో ఇద్దరు సన్నిహితంగా ఉన్నారు. శుక్రవారం సదరు యువతిని తన గదికి రమ్మని అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. భయాందోళనకు గురైన యువతి కేకలు వేస్తూ గదిలో నుంచి పరుగులు తీసింది. బాధితురాలి ఫిర్యాదుతో శుక్రవారం కేసు నమోదు చేసిన పోలీసులు వంశీకృష్ణను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఒలింపియాడ్‌లో 'అల్ఫోర్స్'కు పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులతో నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి: స్థానిక అల్ఫోర్స్ ఇ–టెక్నో పాఠశాల విద్యార్థులు సిల్వర్ జోన్ ఇంటర్నేషనల్ ఇన్ఫర్మేటిక్ ఒలింపియాడ్‌లో బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించారని విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులు జోయల్‌డేవిస్, కృష్ణచైతన్య, మనీష్, అనిరుధ్, వర్షిత్‌సాయి, శ్లోక, సర్వేశ్, ధ్రువ్ శర్మ, అభిరా మ్, కృష్ణప్రతీక్ రెడ్డి, ఓంతేజలను శుక్రవారం పాఠశాలలో అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ట్రినిటీ'లో బోనాల వేడుక



బోనాలతో విద్యార్థులు

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని ట్రినిటీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బోనాల పండుగ విశిష్టతపై సాంస్కృతిక ప్రదర్శనలిచ్చారు. అలాగే వానాకాలంలో ప్రకృతి అందించే వాతావరణ విశేషాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేలా మాన్‌సూన్ ఫెస్ట్ వేడుక నిర్వహించారు.



'అల్ఫోర్స్'లో బోనాల వేడుకలు

రామడుగు: రామడుగు మండలం గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ పాఠశాలలో ఆషాఢం బోనాల వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు బోనాలతో ఊరేగింపు నిర్వహించి, అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. విద్యాసంస్థల ఆధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. బోనాల వేడుకలు తెలంగాణ సాంప్రదాయాలకు చిహ్నమని అన్నారు.



సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

FLAT FOR SALE

- Nagole Co-op Bank Cly Rd-No-19, Sai Krupa Resi, 3BHK, 1485 Sft + 100Sft Parking W/F Furnished Flat, water, CCTV, Safety, Access to Terrace Rs-83.50 Laks. Call : 9154059739 [H-189700]

LEASE / RENT

- అల్గునూర్ గ్రామములో కేంద్రీయ విద్యాలయం దగ్గర 30 ఫీట్ల రోడ్డుకు 25 గుంటల భూమిని కిరాయికి లేదా లీజుకు ఇవ్వబడును.ఫోన్: 9390978999, 7702388808 [HA-442]
- అల్గునూర్‌లో పరమిత ఐరిస్ వరల్డ్ స్కూలు యొక్క కాంపౌండ్ గోడను ఆనుకొని 30 గుంటల కమర్షియల్ ల్యాండ్ కిరాయికి లేదా లీజుకు ఇవ్వబడును.ఫోన్: 9390978999, 7702388808 [HA-441]

TO-LET

- కరీంనగర్ నుండి పెద్దపల్లికి పోయేటప్పుడు 100 ఫీట్ల తోవకు బొమ్మకల్ ఫ్లైఓవర్ దగ్గర, ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంపుకు ఎదురుగాగల బిల్డింగ్‌లో కింద షట్టర్ మరియు పైన 2 BHK ఫ్యామిలీ పోర్షన్ కిరాయికి ఇవ్వబడును. ఫోన్: 9390978999, 7702388808. [HA-440]

www.sakshi.com

SERVICES

కన్‌స్ట్రక్షన్స్

- SLN కన్‌స్ట్రక్షన్స్: మీకు ఇల్లు కట్టుకునే సమయం లేదా! మీ ప్లాట్‌లో మీరు కోరుకునే విధంగా 100% వాస్తుతో ఇల్లు కన్‌స్ట్రక్షన్స్ చేసి ఇవ్వబడును. సంప్ర॥ 9963738468 [K-1187439]

WANTED

- ఒమేగాహోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు ఇంటిపని/వంట పనికు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజ నం.జీ.20K.ఫోన్: 8977639662 / 8977639663 [H-796262]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact: 9951602933, 9951602824